15–03–2023,
శాసనసభ, అమరావతి.

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పే తీర్మానంపై చర్చ సందర్భంగా శాసనసభలో మాట్లాడిన ముఖ్యమంత్రి.

ఈ సందర్భంగా సీఎం శ్రీ వైయస్.జగన్ ఏమన్నారంటే...:

45 నెలల కాలంలో ఏం చేశామో చూస్తే...
గవర్నర్ గారి ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పే తీర్మానం చర్చ, నాలుగో బడ్జెట్ ప్రవేశపెట్టే సందర్భంలో ఈ రోజు మనం ఇక్కడ సమావేశమయ్యాం. మన ప్రభుత్వం వచ్చి దాదాపు 45 నెలలు కావస్తోంది. ఈ మూడు సంవత్సరాల 9 నెలల కాలంలో మనం ఏం చేశామన్నది ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే.. నాలుగు సంవత్సరాలు గడవకముందే 98.5 శాతం మేనిఫెస్టోలో చెప్పిన హామీలన్నీ నెరవేర్చి, అమలు చేసిన తర్వాత దేవుడి దయతో ఈ సభలో నాలుగో బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నాం. ఎన్నికల మేనిఫెస్టో విషయంలో పార్టీలు చూపవలిసిన నిబద్ధతకు సంబంధించి మనం తీసుకువచ్చిన గొప్ప మార్పు ఇది. మామూలుగా మేనిఫెస్టో అంటే ఎన్నికలు అయిపోయిన తర్వాత చెత్తబుట్టలో పడేయడం అన్న సాంప్రదాయానికి పూర్తిగా స్వస్తి పలుకుతూ... మేనిఫెస్టో అంటే అదొక పవిత్ర గ్రంధం అని, అదొక భగవద్గీత అని, బైబిల్ అని, ఖురాన్ అని ప్రజలు పెట్టుకున్న ఆశలని.. వాటిని నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నదని నిరూపిస్తూ... గొప్ప మార్పు తీసుకువచ్చాం.

విలువలు, విశ్వసనీయతకు అర్ధం చెబుతూ...
రాజకీయాలలో విలువలు, విశ్వసనీత అనే రెండు పదాలకు అర్ధం తెలియజేసేలా, ప్రభుత్వంపై నమ్మకం పెరిగేలా, పాలనలో పారదర్శకత తీసుకొచ్చే విధంగా గడిచిన నాలుగు సంవత్సరాల పాలన సాగింది. రాజకీయ వ్యవస్ధలో గొప్ప మార్పును తీసుకునిరాగలిగాం.

ఈ నాలుగు సంవత్సరాల పరిపాలన చూసుకుంటే...
మన ప్రభుత్వంలో కులం, మతం, ప్రాంతం, వర్గంతో పాటు చివరికి ఎవరికి ఓటు వేశారన్నది కూడా చూడకుండా మంచి చేస్తామని ఎన్నికల వేళ ఏదైతే చెప్పామో... ఆ మాటను తూచా తప్పకుండా సంక్షేమపథకాలు, అభివృద్ధి పథకాల్లో అమలు చేశామని మనస్ఫూర్తిగా, సగర్వంగా, సంతోషంగా చెప్పగలుగుతున్నాం.

నా వాళ్లు, కానివాళ్లు అని ప్రజలను విభజించే జన్మభూమి కమిటీలను పూర్తిగా రద్దు చేసి, ఎన్నికల వరకే రాజకీయాలు, ఎన్నికలు అయిపోయిన తర్వాత అందరూ నా వాళ్లే అన్న గొప్ప సందేశాన్ని ఈ నాలుగేళ్ల కాలంలోఇవ్వగలిగాం. ఇది కూడా మనం తీసుకొచ్చిన గొప్ప మార్పు.

భవిష్యత్తు బాగుండాలని...
ఈ రాష్ట్రంలో ప్రతికుటుంబం నిన్నటి కంటే నేడు నేటి కంటే రేపు, రేపటి కంటే భవిష్యత్తు బాగుందని ఎప్పుడైతే నమ్ముతారో అప్పుడే దాన్ని అభివృద్ధి అంటారు. ఇచ్చిన మాట ప్రకారం పేదరికంలో ఉన్న ప్రతి ఒక్క కుటుంబంలోని పిల్లలు, పెద్దలు, వృద్ధులు ఈ మూడు తరాలకు మేలు చేసేలా రూ.1,97,473 లక్షల కోట్లు

డీబీటీ ద్వారా అంటే నేరుగా బటన్ నొక్కి ఎక్కడా లంచాలుకు తావులేకుండా, వివక్షకు చోటు లేకుండా గొప్ప వ్యవస్థలోకి మార్పు తీసుకుని రాగలిగాం. ఇలా తీసుకొచ్చిన ఈ మార్పు మనం చేసిన అతిగొప్ప మార్పు.
గతంలో కుటుంబాల చరిత్రను మార్చలేనివారు, కులాల చరిత్రను మార్చలేని వారు, ఆర్థిక విషయాలపై ఎవరికీ అర్ధం కాని విధంగా పైపైన మాటలు మాట్లాడి గొప్పగా చెప్పుకునేవారు.

మంచి జరిగిందని భావిస్తేనే మద్ధతివ్వండి...
అప్పట్లో బడ్జెట్ ప్రవేశపెట్టి గొప్ప గొప్ప మాటలు చెప్పుకునేవారు. చివరికి ప్రజలకు మాత్రం ఏం మంచి జరిగింది ? ఏ కుటుంబానికి ఏం మంచి జరిగింది ? అంటే ఎవరిదగ్గరా సమాధానం ఉండేది కాదు. అటువంటి పరిస్థితిని మన పాలనలో ఇంటింటికి, మనిషి మనిషికి ఏం మేలు జరిగిందనేది... గడప, గడపకూ వెళ్లి అక్కా మీ కుటుంబానికి ప్రభుత్వం నుంచి జరిగిన మంచి ఇదీ అని ఏకంగా... ప్రింట్ చేసి, వివరాలతో సహా వారికి చెప్పి.. మీకు మంచి జరిగిందని మీరు భావిస్తే మనందరి ప్రభుత్వానికి మద్ధతు పలకండి అని సగర్వంగా మన ఎమ్మెల్యేలు ఇంటింటికీ వెళ్లి జరిగిన మంచిని వివరించగలిగిన గొప్ప స్థానంలో ఈ నాలుగు సంవత్సరాల పరిపాలన సాగింది.

ఇది మనందరి ప్రభుత్వానికి ఉన్న నైతికత, నిబద్ధత అని చెప్పడానికి పెద్ద ఉదాహరణ. ఎన్నికలప్పుడు కాకుండా ఎన్నికలకు ముందే ఎమ్మెల్యేలు ప్రతి ఇంటికి వెళ్లి, ప్రతి అక్కనూ కలిసి, ప్రతి ఇంటిలోనూ జరిగిన మంచిని చెప్పగలిగే పరిస్థితి ఈ 45 నెలల్లో తేగలిగాం.

రాష్ట్ర పరిపాలనా వ్యవస్థలో జరిగిన కొన్ని మార్పులను ముందుగా ప్రస్తావిస్తాను.
రాష్ట్రంలో 2019 నాటికి 13 జిల్లాలు ఉంటే అవి కాస్తా 26 జిల్లాలు అయ్యాయి. అంటే దానర్ధం పెరిగిన జిల్లాల వలన 13 నుంచి 26 మంది కలెక్టర్లు, 26 మంది ఎస్పీలు, 26 మంది జేసీలుతో పాటు అన్నిశాఖలల్లోనూ అధికారులు రెట్టింపు అయ్యారు. అంటే రాష్ట్ర ప్రజలకు పరిపాలన సేవలు రెట్టింపు అయ్యాయి. అధికారులు, అధికారం ప్రజలకు మరింత చేరువ అయ్యాయి. ఇది వికేంద్రీకరణలో తీసుకొచ్చిన మరోమార్పు. రాష్ట్రంలో 2019 వరకు 51 రెవెన్యూ డివిజన్‌లు ఉంటే ఇవాళ 76కు తీసుకునిపోయాం. రాష్ట్రంలోమన ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత 15,004 గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటయ్యాయి. వీటిలో మన పిల్లలు అక్కడే ఉద్యోగం చేస్తూ.. శాశ్వత ఉద్యోగులుగా 1.34 లక్షల మంది కనిపిస్తున్నారు. ప్రతి సచివాలయంలోనూ గ్రామస్థాయిలోనే దాదాపు 600 పౌరసేవలు ఎటువంటి లంచాలు, వివక్షకు తావులేకుండా అందుతున్నాయి.
ప్రతి 50 ఇళ్లకు ఒక వాలంటీర్ చొప్పున చేయిపట్టుకుని నడిపించేందుకు ..గ్రామ సచివాలయలతో అనుసంధానమై 2.65లక్షల మంది వాలంటీర్లుగా గ్రామాల్లో మంచి చేస్తున్నారు.
గ్రామాలలో, మారుమూల పల్లెల్లో ఎక్కడ చూసినా పౌరసేవల్లో ఇదొక విప్లవం.

ఆర్బీకేలు - విత్తనం నుంచి విక్రయం వరకూ...
మనందరి ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా ఏర్పాటు చేసిన 10,778 రైతు భరోసా కేంద్రాలు గ్రామస్థాయిలో కనిపిస్తున్నాయి. ఇందులో విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు ప్రతి సేవలోనూ రైతన్నకు తోడుగా ఉంటూ, రైతన్నను చేయిపట్టుకుని నడిపించే గొప్ప వ్యవస్థ గ్రామస్థాయిలోనే అందుబాటులో ఉంది.
ఈ ఆర్బీకేలలో 10778 మంది అగ్రికల్చర్, హార్టికల్చర్ గ్రాడ్యుయేట్లు అక్కడ పనిచేస్తూ రైతులకు తోడుగా ఉన్నారు. గత ప్రభుత్వంలో ఇలాంటి ఆర్బీకేలు కానీ, ఇలాంటి సేవలు కానీ కనిపించే పరిస్థితి లేదు.

భూ వివాదాలకు శాశ్వత ముగింపు దిశగా....

ఇది మనం గ్రామ స్థాయిలో తీసుకొచ్చిన గొప్ప మార్పు. గతంలో మండలానికి ఒక సర్వేయరు ఉంటే గొప్ప విషయం. అతడు కూడా లంచాలు ఇస్తే తప్ప మీకు దొరకని పరిస్థితి. మండలానికి ఒక్కడే ఉంటాడు కాబట్టి... అందరికీ అందుబాటులోకి రాని పరిస్థితి. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి గ్రామంలోనూ పట్టణాల్లోని వార్డుల్లోన్లూ 10,185 మంది సర్వేయర్లను నియమించాం. మండలానికి ఒక సర్వేయరు లేని పరిస్థితి నుంచి ఈ రోజు 10,185 మంది సర్వేయర్లు గ్రామస్థాయిలో సచివాలయంలో అందుబాటులో ఉండటంతో పాటు ఇవాళ 100 సంవత్సరాల తర్వాత సమగ్ర భూసర్వే చేపట్టి, కబ్జాలకు, భూవివాదాలకు శాశ్వతంగా స్వస్తి పలికేలా అడుగులు వేస్తున్న ప్రభుత్వం మనదే.
ఇది మనందరి ప్రభుత్వం గ్రామస్థాయిలో తీసుకొచ్చిన మరోమార్పు.

2019 వరకు రాష్ట్రంలో ఉన్న మెడికల్ కాలేజీలు కేవలం 11 మాత్రమే. ఈ 45 నెలల కాలంలో మరో 17 మెడికల్ కాలేజీలు ఇవాళ రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించబడుతున్నాయి. మనవైద్య ఆరోగ్య రంగం మీద మనం చూపుతున్న శ్రద్ధకు ఇది ఒక చిన్న నిదర్శనం.
రాష్ట్రంలో ఇప్పటివరకూ కేవలం 6 పోర్టులు ఉంటే... మరో 4 పోర్టులను నిర్మిస్తున్నాయి. మరో 9 ఫిషింగ్ హార్బర్లు రాబోతున్నాయి.

25 యేళ్ల పాటు కరెంటుకు ఢోకా లేకుండా...
మరో 7వేల మెగావాట్లకు సంబంధించి కేవలం రూ.2.49 లకే మరో 25 సంవత్సరాలపాటు అందుబాటులో ఉండేటట్టుగా, సంవత్సరానికి 17వేల మిలియన్ యూనిట్లు వ్యవసాయానికి, పగటిపూటే అందుబాటులో ఉండేలా ఉచిత కరెంటుకు ఢోకా లేకుండా ఏర్పాటు చేసిన ప్రభుత్వం కూడా మనదే.

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో నెంబర్ వన్‌గా ఏపీ...
ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో వరుసగా మూడేళ్లుగా దేశంలో నెంబర్ వన్ స్థానాన్ని మన రాష్ట్రమే తీసుకుంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకింగ్ ఇచ్చే ప్రక్రియలో గత మూడేళ్ల కిందట మార్పులు చేశారు. ఆ ప్రక్రియలో పరిశ్రమలు పెడుతున్న వాళ్ల అభిప్రాయాలు కూడా అడుగుతున్నారు. వాళ్ల అభిప్రాయాల మేరకు ఈ ర్యాంకింగ్‌లు ఇస్తున్న నేపధ్యంలో మన రాష్ట్రం దేశంలో మూడు సంవత్సరాలుగా నెంబర్ వన్‌గా నిలవడం గొప్ప తార్కాణం.

గతంలో రాష్ట్రంలో ఎన్నడూ లేని పారిశ్రామకసంస్థలు, పారిశ్రామిక వేత్తలు మన రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడాన్నిమనం చూస్తున్నాం. అటు దావోస్‌లోనూ, ఇటు విశాఖ సమ్మిట్‌లోనూ చూశాం. ఇది మన పారిశ్రామిక రంగంలో తిరుగులేని మార్పులకు మనం ఏ రకంగా శ్రీకారం చుట్టామని చెప్పడానిది ఇది ఒక నిదర్శనం. 28 రాష్ట్రాల భారతదేశంలో 2021–22 సంవత్సరానికి అత్యధికంగా 11.23 శాతం ఆర్ధిక వృద్ధిరేటుతో దేశంలోనే నెంబర్‌వన్‌గా మన రాష్ట్రం జీఎస్‌డీపీ గ్రోత్ రేటు నమోదు చేసింది.

2021–22 ఆర్ధిక సంవత్సరంలో తలసరి ఆదాయాన్ని చూసినా 14.02 శాతం పెరిగిన రాష్ట్రం ఏదైనా ఉందంటే అది కూడా మన రాష్ట్రమే. దేవుడి దయ వలన ప్రజల కష్టంతో మంచి గవర్నెన్స్ తీసుకురావడంతో ఇదంతా సాధ్యమైంది.

అడుగడుగునా అభివృద్ధి....
గ్రామం నుంచి రాష్ట్ర రాజధానుల వరకూ అడుగడుగునా కూడా 45 నెలల పాలనలో మార్పు కనిపిస్తోంది. మీ జగన్ మార్కు కూడా కనిపిస్తోంది.

ఈ 45 నెలల పాలనలో ఈ రాష్ట్రంలో ఏ ఒక్క గ్రామాన్ని తీసుకున్నా ఆ గ్రామంలో ప్రస్ఫుటంగా కనిపిస్తున్న మార్పులు గమనించవచ్చు. ప్రతి గ్రామంలో మనం వచ్చిన తర్వాత కొత్తగా ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాలు కనిపిస్తాయి.
అందులో దాదాపుగా 10 మంది పిల్లలు అక్కడ ఉద్యోగం చేస్తూ చిక్కటి చిరునవ్వుతో మనకు గుడ్‌మార్నింగ్ చెప్పే పరిస్థితి మనకు ఈ రోజు మన గ్రామంలోనే కనిపిస్తోంది. వీరి ద్వారా 600 కు పైగా సేవలు అందుబాటులో కనిపిస్తున్నాయి. అదే గ్రామంలో ఇవాళ ప్రతి 50 ఇళ్లకు వాలంటీర్ చేయిపట్టుకుని ప్రతి సేవా కార్యక్రమంలో ప్రజలకు తోడ్పాటునిస్తూ సేవలందిస్తున్నారు. అదే గ్రామంలో మరో నాలుగు అడుగులు వేస్తే... రైతు భరోసా కేంద్రం కనిపిస్తోంది. అక్కడే అగ్రికల్చర్ గ్రాడ్యుయేట్ పనిచేస్తూ.. ఇ–క్రాప్ డేటా నమోదు చేస్తూ.. పంట విత్తనం నుంచి కొనుగోలు వరకు రైతులకు సాయం చేస్తున్న తీరు కనిపిస్తోంది.
మరో నాలుగు అడుగుల దూరంలో వైయస్సార్ విలేజ్ క్లినిక్ కనిపిస్తోంది. విలేజ్ క్లినిక్‌లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ 24 గంటలూ అందుబాటులో ఉండడంతో పాటు దాదాపుగా 105 రకాల మందులు 14 రకాల పరీక్షలు చేస్తూ.. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో అనుసంధానమై అక్కడే సేవలందిస్తూ కనిపిస్తారు.

మరో నాలుగు అడుగుల దూరంలో డిజిటల్ లైబ్రరీలు కనిపిస్తాయి. వీటిని కొన్నిచోట్ల కడుతున్నాం. మరికొన్ని చోట్ల కట్టబోతున్నాం. అన్‌లిమిటెడ్ బ్యాండ్ విడ్త్‌తో ఇప్పటికే 4వేల గ్రామాలకు ఫైబర్ ఆప్టిక్ గ్రిడ్ కూడా చేరుకుంది. మిగిలిన 13వేల పంచాయితీలకు డిసెంబరు నాటికి పూర్తిగా చేరుతుంది. బ్యాండ్ విడ్త్ చేరిన చోట.... డిజిటల్ లైబ్రరీని క్రియేట్ చేసి అన్‌లిమిటెడ్ బ్యాండ్ విడ్త్ ద్వారా వర్క్ ఫ్రమ్ హోమ్‌ని గ్రామస్థాయిలోనే ఫెసిలిటేట్ చేయబోతున్నాం.

అదే గ్రామంలో నాడునేడుతో మారిన ఇంగ్లిషు మీడియం స్కూళ్లు కనిపిస్తాయి. అక్కడ నుంచి కొద్ది దూరంలోనే పేదఅక్కచెల్లెమ్మల చేతికి  మనం ఇచ్చిన ఇళ్ల స్థలాలు, ఆ ఇళ్ల స్థలాలులో నిర్మాణమవుతున్న ఇళ్లు కనిపిస్తాయి. అవి కేవలం ఇళ్లు కాదు కాలనీలు.
ఇవన్నీ గ్రామస్థాయిలో ఏగ్రామం చూసుకున్న ప్రస్ఫుటంగా నేను చెప్పినవన్నీ అభివృద్ధిగా కనిపిస్తాయి. నాలుగేళ్ల కాకమునుపే మన ప్రభుత్వం గ్రామ స్థాయిలో తీసుకొచ్చిన మార్పు ఇది.

గతానికీ ఇప్పటికే తేడా చూస్తే...
గత ప్రభుత్వ హయాలంలో ఎన్నికలకు రెండు నెలల ముందు వరకు... వాళ్లు అందించిన పెన్షన్ కేవలం రూ.1000. అది కూడా 39 లక్షల మందికి. ఇప్పుడు దేవుడు దయతోమనందరి ప్రభుత్వంలో పెన్షన్ రాష్ట్ర వ్యాప్తంగా అందుకుంటున్నవారు 64 లక్షల మంది ఉన్నారు. మన ప్రభుత్వం ఏర్పాటు అయిన వెంటనే పెన్షన్‌ను రూ.2250కు పెంచి ఇప్పటికి రూ.2750కు తీసుకెళ్లాం. బడ్జెట్‌లో జనవరి నాటికి పెన్షన్‌ను రూ.2,750నుంచి రూ.3000కు తీసుకునిపోయి ఆ తర్వాతనే ఎన్నికలకు వెళ్లే కార్యక్రమం జరుగుతుంది.

దేశంలో ఎక్కడా లేని విధంగా....
ఒకటో తేదీన సూర్యోదయానికి ముందే వాలంటీర్ ఇంటింటికీ వచ్చి చిక్కటి చిరునవ్వుతో గుడ్ మార్నింగ్ చెప్పి ప్రతి అవ్వకూ, తాతకూ పెన్షన్ చేతిలో పెట్టే కార్యక్రమం చేస్తున్నారు. ఇలాంటి కార్యక్రమం రాష్ట్రంలోనూ, దేశంలోనే కాదు ప్రపంచంలోనే ఎక్కడా లేదు. ఇది మన ప్రభుత్వం తీసుకొచ్చిన గొప్ప మార్పు.

ఇంటి వద్దకే రేషన్– రోల్ మోడల్‌గా ఏపీ.
మన ప్రభుత్వంలో రేషన్ కార్డులు 1.46 కోట్లకు పెంచాం. రాష్ట్రంలో ఏ పల్లెలో అయినా పట్టణంలో అయినా రేషన్ బియ్యం మన వీధికి, మన ఇంటి ముంగటే అందించే వ్యవస్థ దేశంలో ఏ రాష్ట్రంలో

అయినా ఉందా ? మనం ఎలా చేస్తున్నామో కాపీ కొట్టి మిగిలిన రాష్ట్రాలు ఎలా చేయాలో నేర్చుకునే రోల్ మోడల్ రాష్ట్రంలోగా మన రాష్ట్రం ఉంది. రేషన్ షాపులు దగ్గర గంటలతరబడి క్యూలో నిలబడే దుస్థితిని నివారించి రాష్ట్ర వ్యాప్తంగా మొత్తంగా 9,260 డెలివరీ వ్యాన్‌తో నాణ్యమైన సార్టెక్స్ మధ్యస్త సన్న బియ్యాన్ని నెలనెలా డెలివరీ చేస్తున్న ప్రభుత్వం మరెక్కడైనా ఉందా ? ఇది మన ప్రభుత్వం వలన వచ్చిన ఇంకో గొప్ప మార్పు.

మన ప్రభుత్వ స్కూళ్లు– ఊహకందని మార్పులు...
గత ప్రభుత్వంలో శిధిలమైన పరిస్థితుల్లో ఉన్న గవర్నమెంటు బడులు. అలాంటి బడులను మరో రెండేళ్లు పోతే కార్పొరేట్ బడులు సైతం గవర్నమెంటు బడులతో పోటీపడేలా తీసుకువస్తూ.. గవర్నమెంటుబడిని సీబీఎస్ఈ ఇంగ్లిషు మీడియంతో తీర్చిదిద్దగలుగుతామని, ఎనిమిదో తరగతి పిల్లలకు ట్యాబులు ఇస్తామని, ఆరో తరగతి నుంచి ప్రతి తరగతి గదిలోనూ ఐఎఫ్‌పి(ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్) ఏర్పాటుచేసి... విద్యావిదానాన్ని డిజిటల్ యుగంలోకి తీసుకుని వెళతామని, గోరుముద్ధ మెనూ నుంచి పిల్లల డ్రెస్ వరకు ఒక మేనమామలో ముఖ్యమంత్రి శ్రద్ధ తీసుకోవడాన్ని, జగనన్న విద్యాదీవెన వందశాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయడమేకాకుండా వసతి దీవెనతో పిల్లలందరికీ తోడుగా
ఉండే పరిస్థితి గత ప్రభుత్వంలో ఏనాడైనా ఎక్కడైనా జరిగిందా ? ఇలాంటి మార్పు ఊహకైనా అందుతుందా ? అని అడుగుతున్నాను.
రెండేళ్లుపోతే ఆరో తరగతి నుంచి ప్రతి తరగతిలోనూ డిజిటల్ క్లాస్‌రూమ్‌లు. ఇంటరాక్టివ్ ఫ్లాట్‌ఫామ్‌లలో పిల్లలకు చెప్పడం మొదలుపెడితే కార్పొరేట్ బడులు వీరితో పోటీపడేలా ఇదే మాదిరగా ఐఎఫ్‌పిలు ఏర్పాటు చేసి, గవర్నమెంటు బడులవలె మార్చుకునే పరిస్థితి మరో రెండు సంవత్సారలలో జరుగుతుంది. ఇందులో సుమారు 15,200 స్కూళ్లలో 6వతరగతి నుంచి ఉన్న 5,800 స్కూళ్లలో 30,230 క్లాస్ రూమ్‌లలో ఈ జూన్‌లో స్కూళ్లు తెరిచే నాటికి ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్‌తో పూర్తిగా డిజిటల్ క్లాసురూములు రాష్ట్ర వ్యాప్తంగా వస్తాయి.

8వతరగతి నుంచి ట్యాబులు ఇస్తున్నాం. రాబోయే సంవత్సరం ఇదే కార్యక్రం జరిగితే ప్రైవేటు స్కూళ్లలో కూడా ట్యాబులు ఇస్తారు. ప్రభుత్వ స్కూళ్లలోనే ట్యాబులు ఇస్తే... మనం ఇవ్వకపోతే ఇబ్బంది పడతామని ప్రైవేటు స్కూళ్లు కూడా ట్యాబులు ఇస్తారు. ఇవన్నీ ఎంత గొప్పగా మార్పులు జరుగుతున్నాయనదానికి ఉదాహరణ.

ఎవ్వరూ ఊహించి ఉండరు. గవర్నమెంటుబడులు కార్పొరేట్ బడులతో పోటీపడటమే గొప్ప అనుకునే వాతావరణం నుంచి.. కార్పొరేట్ బడులు గవర్నమెంట్ బడులతో పోటీ పడే పరిస్థితి వస్తుందన్న ఊహ కూడా ఎవరికీ వచ్చి ఉండదు.

మనబడి నాడు నేడుతో రాష్ట్రంలో దాదాపు 45వేల స్కూళ్లు, కాలేజీలు రూపం మారుతున్నాయి. ఇవి వచ్చే తరం పిల్లల భవిష్యత్ కోసం మన ప్రభుత్వం తీసుకువస్తున్న గొప్ప మార్పు.

నవరత్నాల పథకాలను ఒకసారి గమనిస్తే..
తమ పిల్లలను చదవించే తల్లులకు రూ.15వేలు సాయం చేయడం అన్న ఆలోచన గతంలో ఎప్పుడూ చూసిందీ లేదు. దేశంలో కూడా ఎక్కడా ఏరాష్ట్రంలో లేదు. మన ప్రభుత్వం నాలుగేళ్లలో ఈ అమ్మఒడి పథకం ద్వారా 48.48 లక్షల తల్లుల చేతుల్లో పెట్టిన మొత్తం రూ.19,674 కోట్లు.
కేవలం పిల్లలను బడికి పంపించమని తల్లలను ప్రోత్సహించాడనికి చేసిన వ్యయం ఇది. 75 శాతం హాజరు కచ్చితంగా ఉండాలని మంచి మేనమామలా తాపత్రయపడి, చదువుల కోసం ఆరాటపడుతూ తెచ్చిన గొప్ప పథకం.

రైతు భరోసా పథకం తీసుకుంటే 52.38 లక్షల మంది రైతులకు నాలుగేళ్ల కాలంలో ఈ పథకం ద్వారా రూ.27,062 కోట్లు. కౌలు రైతులు, ఆర్వోఎఫ్ఆర్ రైతులకు సైతం ఈ సాయం అందిస్తున్న ప్రభుత్వం మనదే.
బీమా ప్రీమియంగా రైతులు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సినఅవసరం కూడా లేకుండా బీమా భారాన్ని తానే చెల్లిస్తున్న ప్రభుత్వం మనదే. ఇలా చెల్లించే 44.05 లక్షల మంది రైతులకు రూ.6,872 కోట్లు పరిహారంగా అందజేసిన ప్రభుత్వం మనదే.

ఇన్పుట్ సబ్సిడీ, సున్నావడ్డీ, పగటిపూటే తొమ్మది గంటల ఉచిత విద్యుత్, ఎంఎస్పీకి ఏమాత్రం తగ్గకుండా ఆహారధాన్యాల కొనుగోలు, ధాన్యం సేకరణ, ఆర్బీకేల ద్వారా ఇ– క్రాపింగ్ ఇలా ప్రతి ఒక్క విషయంలో చరిత్రలో వ్యవసాయరంగంలో ఎన్నడూ జరగని విధంగా మార్పులు తీసుకువచ్చిన ప్రభుత్వం మనదే.

45 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల మధ్యలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు ఆర్థికంగా అండ దండలు అందిస్తున్న వైయస్సార్ చేయూత లాంటి పథకం రాష్ట్ర చరిత్రలోనే కాదు దేశంలో కూడా ఎప్పుడూ, ఎక్కడా ఇలాంటి స్కీం జరగలేదు.
ఈ పథకం ద్వారా 26.40 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు రూ.14,129 కోట్లు అందించాం. దీంతో పాటు ఐటీసీ, పీ అండ్ జీ, రిలయెన్స్, అమూల్ వంటి  పెద్ద పెద్ద సంస్థలను తీసుకుని వచ్చి ఆ అక్కచెల్లెమ్మలకు జీవనోపాధికి సంబంధించిన మార్గాలను చూపుతూ.. బ్యాంకులను మమేకం చేస్తూ వీళ్లకు దారి చూపించిన గొప్ప వ్యవస్థను చేయూత ద్వారా తీసుకొచ్చాం.

సున్నా వడ్డీతో అక్కచెల్లెమ్మలను ఆదుకుంటూ.. మరోవైపు పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలను అండగా నిలబడేందుకు వైఎస్ఆర్ ఆసరా ద్వారా రూ.25వేల కోట్లను నాలుగు విడతల్లో వారికి చెల్లిస్తామని మాట ఇచ్చాం. అన్న మాట ప్రకారం మూడో విడత చెల్లింపునకు సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే రెండు విడతల్లో రూ.12,758 కోట్లు 78.74 లక్షల అక్కచెల్లెమ్మల చేతిలో పెట్టాం.

గత ప్రభుత్వం ఎన్నికల్లో వాగ్దానం చేయడం,
ఎన్నికల అయిపోయిన తర్వాత మోసం చేయడం పొదుపు సంఘాలన్నింటినీ కూడా దెబ్బ తీయడంమన కళ్లెదుటనే చూశాం.
గత ప్రభుత్వంలో అవుట్ స్టాండింగ్ లోన్స్ ఎన్పీఏల కింద దాదపు 18శాతం అక్కచెల్లెమ్మల ఏ, బి గ్రేడ్ సంఘాలన్నీ సీ, డీ గ్రేడ్గా దిగజారిపోయాయి.
ఇవాల అవుట్ స్టాండింగ్ లోన్స్ కేవలం పాయింట్ ఐదు శాతం. అంటే 99.5 శాతం ఇవాళ అక్కచెల్లెమ్మలు సంతోషంగా కడుతున్నారు. తేడా గమనించండి.

అన్ని వర్గాల సంక్షేమం దిశగా...
వైయస్సార్ కాపునేస్తం ద్వారా 3.56 లక్షల మందికి రూ.1518 కోట్లతో సాయం చేశాం. వైయస్సార్ ఈబీసీ నేస్తం ద్వారా మరో 3.94 లక్షల మందికి రూ.595 కోట్లు ఇవ్వగలిగాం.
ఇలాంటి పథకాలతో అక్కచెల్లమ్మల సాధికారతను తమ విధానంగా మార్చుకుని అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం మనది.
ఈ రోజు జీడీపీ గ్రోత్ రేటు 11.23 శాతానికి పెరిగాం. ఆ స్థాయిలో గ్రోత్ రేటు మన రాష్ట్రంలో రావడానికి కారణం ఏమిటంటే.. ఎకానమిస్టులకు కూడా ఇది అవసరమైన అంశం అవుతుంది.

ఉద్యోగాల కల్పన దిశగా....
ఐదున్నర కోట్ల జనాభాలో  ఉన్నవి నాలుగు లక్షలు ప్రభుత్వ ఉద్యోగాలు. మనం వచ్చిన తర్వాత నాలుగు లక్షలు నుంచి ఆరు లక్షల ఉద్యోగాలు చేయగలిగాం. సగం ఉద్యోగాలు పెంచాం. కానీ

ఐదున్నర కోట్ల జనాబాలో 6లక్షల ఉద్యోగాలు. పెద్ద, పెద్ద పరిశ్రమలు మిగిలినవి అన్నీ చూసుకుంటే మరో 15–20 లక్షల ఉద్యోగాలు. ఈ నేపధ్యంలో ఉద్యోగాలు ఎక్కువగా ఎక్కడ ఉన్నాయి అని గమనిస్తే.. ఎంఎస్ఎంఈ సెక్టారులో ఉన్నాయి. ఒక్కో ఎంఎస్ఎంఈ సెక్టారు కనీసం 10 మందికి ఉపాధి కల్పిస్తుంది. ఇంతకముందు 1.10 లక్షల ఎంఎస్ఎంఈ యూనిట్లు రాష్ట్రంలో ఉంటే... మన ప్రభుత్వం
ఏర్పాటైన తర్వాత మరో 1.56 లక్షల ఎంఎస్ఎంఈ యూనిట్లు ఏర్పాటయ్యాయి. చేయిపట్టుకుని ప్రోత్సహిమిస్తూ వాటిని నడిపిస్తున్నాం. పెండింగ్‌లో ఉన్న ఇండస్ట్రియల్ ఇన్సెంటివ్‌లు అన్ని క్లియర్ చేస్తూ.. ఎంఎస్ఎంఈలకు ప్రభుత్వం తోడుగా ఉందని భరోసా ఇస్తూ అడుగులు వేస్తున్నాం.

ఇంకా మిగిలిన రంగాల్లో  ఎక్కడెక్కడ ఉద్యోగాలు స్ధిరంగా నిలబడ్డం వల్ల రాష్ట్రంలో గ్రోత్ రేటు పెరుగుతాయని చూస్తే.. పెద్ద రంగం వ్యవసాయరంగం. 62 శాతం జనాభా ఆధారపడి ఉన్నరంగం వ్యవసాయ రంగం. అటువంటి వ్యవసాయ రంగంలో రైతులకు తోడుగా ఉంటూ రైతు భరోసా సొమ్మును కచ్చితంగా సమయానికి ఇవ్వడంతో పాటు ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవన్నీ క్రమం తప్పకుండా ఏ టైంలో రావాల్సిన ఆ టైంలో అందిస్తూ.. ఆర్బీకేల ద్వారా రైతన్నలను చేయిపట్టుకుని నడపించగలుగుతున్నాం కాబట్టి... వ్యవసాయ రంగం నిలదొక్కుకుంది. దానిలో 62 శాతం జనాభా ముడిపడి ఉన్నారు.

స్వయం ఉపాధి రంగానికి ఊతమిస్తూ....
ఇది కాక గ్రోత్‌కు బూస్ట్‌నిచ్చే మరో గొప్ప రంగం. స్వయం ఉపాధి రంగం. వైయస్సార్ మత్స్యకార భరోసా ద్వారా 1.20లక్షల మంది మత్స్యకారులకు రూ.422 కోట్లు సాయం చేసి వారికి తోడుగా నిలబడి, వాళ్ల కాళ్లమీదవారు నిలబడేందుకు ఉపయోగపడ్డాం. వైయస్సార్ నేతన్న నేస్తం ద్వారా 82వేల కుటుంబాలకు రూ. 778 కోట్లు అందించి వాళ్లకు తోడుగా నిలబడ్డాం.
వాహనమిత్ర, జగనన్న తోడు, జగనన్న చేదోడు, లా నేస్తం వంటి వినూత్న ఆలోచనలతో తోడుగా నిలబడ్డాం. జగనన్న చేదోడు ద్వారా ఫుట్‌పాత్‌లమీద కూరగాయలు అమ్ముకునేవారు, తోపుడుబండ్లమీద వ్యాపారాలు చేసేవారు ఇలాంటి వారికి 15 లక్షల మందికి తోడుగా నిలబడ్డాం. ఇలా వాహనమిత్ర, జగనన్న తోడు వంటి పథకాల ద్వారా స్వయం ఉపాధి కల్పించుకుని వాళ్ల కాళ్లమీద వాళ్లు నిలబడ్డానికి తోడుగా ప్రభుత్వం నిలిచింది. ఈ బలహీనులకు అండదండగా, తోడుగా నిలబడిన ఏకైక ప్రభుత్వం మనదే.

ఇవన్నీ చేయగలిగాం. వీటితో పాటు 30.75 లక్షల ఇళ్ల పట్టాలు ఇచ్చి 22 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నాం. సిమెంటు, స్టీలు, లేబర్ పనిపెరిగి ఈ రకమైన గ్రోత్‌తో దేశానికి ఏపీ రోల్‌మోడల్‌గా నిలబడగలిగింది.

కోవిడ్ టైంలోనూ...
ప్రపంచాన్నే వణికించిన కోవిడ్ సమయంలో ఆ మహమ్మారిని సమర్ధవంతంగా ఎదుర్కొన్న రాష్ట్రాలలో దేశంలోని అగ్రగామి స్ధానంలో మన రాష్ట్రం కూడా ఒకటిగా నిలబడిందని చెప్పడానికి గర్వ పడుతున్నాను. వైద్య రంగంలో కనీవినీ ఎరగని విధంగా ప్రివెంటివ్ కేర్‌లో ఒక కొత్త అధ్యాయాన్ని రాస్తూ, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను తీసుకొచ్చాం. ఆ కాన్సెప్ట్ తీసుకొస్తూ.. గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో మనందరి ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైయస్సార్ హెల్త్ క్లినిక్‌లు అక్షరలా 10,550. గ్రామంలో ఉన్న విలేజ్ క్లినిక్‌లు మొదలు పెడితే, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, డిస్ట్రిక్ట్ ఆస్పత్రులు, టీచింగ్ ఆస్పత్రులు.. నాడు–నేడుతో వాటి రూపురేఖలు పూర్తిగా మారుస్తూ, వాటన్నింటినీ జాతీయస్ధాయి ప్రమాణాలకు అభివృద్ధి చేసే ఒక గొప్ప కార్యక్రమం జరుగుతోంది. ఇది మన ప్రభుత్వం తీసుకొచ్చిన మరో గొప్ప మార్పు.

గ్రామాల్లో మహిళ పోలీసులు...

మరో ముఖ్య విషయం కూడా చెప్పాలి. గత ప్రభుత్వంలో గ్రామాల్లో ఉన్న మహిళా పోలీసులు సున్నా. అదే మనందరి ప్రభుత్వంలో గ్రామ, వార్డు స్థాయిలో నియమించిన మహిళా పోలీసులు 15 వేలు. ఒక అమ్మ ఒడి కానివ్వండి ఆసరా కానివ్వండి. సున్నావడ్డీ కానివ్వండి. చేయూత కానివ్వండి. 30 లక్షల ఇళ్ల పట్టాలు కానివ్వండి. 22 లక్షల మందికి ఇళ్ల నిర్మాణం కానివ్వండి. కాపు నేస్తం కానివ్వండి. ఈబీసీ నేస్తం పథకం కానివ్వండి. ఇవన్నీ కూడా మహిళా పక్షపాత ప్రభుత్వంగా మనం వేసిన ముందడుగు అయితే, వీటన్నింటితో పాటు, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా దిశ యాప్ తీసుకురావడం. ఒక గొప్ప అడుగు మనం వేశాం. ఈ దిశ యాప్‌ను ఇప్పటికే 1.36 కోట్ల అక్క చెల్లెమ్మలు డౌన్‌లోడ్ చేసుకున్నారు. 1.17 కోట్ల మంది వారి ఫోన్లలో రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నారు. ఆపదలో ఉన్నప్పుడు ఏ అక్క చెల్లెమ్మ అయినా ఎస్ఓఎస్ బటన్ నొక్కినా కానీ, లేదా ఆ ఫోన్‌ను 5సార్లు గట్టిగా షేక్ చేసినా కానీ, వెంటనే 10 నిమిషాల్లోనే పోలీస్ సోదరుడు వచ్చి.. అక్కా నీకేమైంది? చెల్లీ నీకేమైంది? అని అడిగి భరోసా ఇచ్చే ఒక గొప్ప అడుగు రాష్ట్రంలో పడింది.

దిశ యాప్‌తో పాటు, దిశ బిల్లు తీసుకొచ్చాం. దాన్ని చట్టంగా మార్చడం కోసం కేంద్ర ప్రభుత్వం ఆమోదం అవసరం. ఎందుకంటే అది ఉమ్మడి జాబితా (కాంకరెన్స్ లిస్ట్)లో ఉంది. కాబట్టి దానికి కేంద్ర ప్రభుత్వ ఆమోదం అవసరం. ఆ బిల్లు అక్కడ ఉంది. ఇప్పటికే దిశ పోలీస్ స్టేషన్లు ప్రతి చోటా కనిపిస్తున్నాయి. దిశ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ప్రతి జిల్లాలో కనిపిస్తున్నారు. ఇవన్నీ అక్కచెల్లెమ్మలకు తోడుగా, అండగా ఉండేందుకు తీసుకొచ్చిన గొప్ప మార్పులు అని చెప్పడానికి గర్వపడుతున్నాం.
ఎలాంటి లంచాలకు తావు లేకుండా, ఎలాంటి వివక్షకు చోటు లేకుండా పారదర్శకంగా, నేరుగా ప్రజల ఖాతాల్లోకి డీబీటీ ద్వారా అక్షరాలా రూ.2 లక్షల కోట్లు బదిలీ చేశాం. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ ఈ స్థాయిలో డీబీటీ జరగలేదని చెప్పడానికి గర్వ పడుతున్నాను. ఇందులో కూడా 76 శాతం నేరుగా నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనారిటీ వర్గాలకే అందిందని చెప్పడానికి గర్వ పడుతున్నాను.
ఇది మనందరి ప్రభుత్వం తీసుకొచ్చిన అతి పెద్ద గొప్ప మార్పు అని చెప్పడానికి చాలా సంతోషపడుతున్నాను. ఎందుకంటే ఇంతకు ముందు ఏది కావాలన్నా లంచం. ఇంకా లంచంతో పాటు వివక్ష. ఈరోజు అవేవీ కూడా ఎక్కడా కనిపించడం లేదు. నేరుగా బటన్ నొక్కుతున్నాం. నేరుగా అక్క చెల్లెమ్మల ఖాతాల్లోకి నగదు వెళ్లిపోతుంది.

చివరగా రెండు మాటలు..
నాకు పరిశ్రమలు ఎంత ముఖ్యమో.. వ్యవసాయం కూడా అంతే ముఖ్యం. నాకు ఐటీ ఎంత ముఖ్యమో.. చిరు వ్యాపారులు, నా బీసీ, నా ఎస్సీ, కుల వృత్తుల్లో ఉన్న వారు కూడా అంతే ముఖ్యం. వారు ఎలా బ్రతకగలుగుతున్నారో అన్నది కూడా అంతే ముఖ్యం. నాకు ప్రభుత్వ ఉద్యోగులు ఎంత ముఖ్యమో.. నెల నెలా పెన్షన్లు తీసుకుంటున్న అవ్వాతాతలు కూడా అంతే ముఖ్యం.

మనందరి ప్రభుత్వం ద్వారా సంక్షేమం, అభివృద్ధి పథకాలు.. డబ్బులందుకుంటున్న నిరుపేద అక్క చెల్లెమ్మలు, వారి కుటుంబాలు, వారి బాగోగులు కూడా అంతే ముఖ్యమని చెప్పడానికి.. ఈ సందర్భంగా, ఈ సభ ద్వారా చెప్పడానికి గర్వ పడుతున్నాను.
వారి సామాజిక, రాజకీయ, ఆర్థిక, విద్య, లింగ వివక్షలేని సాధికారతలు అంతకన్నా ముఖ్యమని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

ఇవన్నీ మనసులో పెట్టుకుని..
నా మంత్రి మండలిలో, మన ప్రభుత్వం ఇచ్చే నామినేటెడ్ పదవులు, ఆలయ బోర్డులు, ఏఎంసీలు, స్థానిక సంస్థల్లో.. ఏ దాంట్లో చూసుకున్నా సామాజిక న్యాయంతో పాటు, రాజకీయ న్యాయం కూడా అంతే ప్రస్ఫుటంగా కనిపిస్తుందని గర్వపడుతున్నాను.

ఆ పదవుల్లో కనీసం సగం వాటా అక్క చెల్లెమ్మలకు ఇచ్చేలా, సగం వాటా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కుటుంబ సభ్యులకు నిండు మనసుతో ఇవ్వడం కూడా నాకు అంతే ముఖ్యమని చెప్పడానికి గర్వ పడుతున్నాను.
ఈ దిశగా ప్రతి అడుగు ఒక దీక్షగా వేయగలిగామని ఈ సందర్భంగా చెప్పడానికి చాలా చాలా సంతోషపడుతున్నాను.

నా ప్రయాణం పేదలతోనే
ఇక్కడే ఇంకో విషయం కూడా చెప్పాలి.
ఇంతకు ముందు ప్రభుత్వాల్లో మనమంతా చూశాం. గాల్లో మాటలు. ఏం మాట్లాడుతున్నారో.. ఏం చూపిస్తున్నారో.. అర్థం కాని పరిస్థితి. గ్రాఫిక్స్ అలాగే ఉండేవి. ఆ మాటలు అలాగే ఉండేవి. అదిగో మైక్రోసాఫ్ట్ అనేవారు. అదిగో బిల్‌గేట్స్ అనే వారు. అదిగో బులెట్ ట్రెయిన్ అని.. గొప్ప గొప్ప మాటలు. కానీ నా నడక మాత్రం నేల మీదే. నా ప్రయాణం మాత్రం సామాన్యులతోనే. నా ప్రయాణం పేదలతోనే. నా యుద్ధం పెత్తందార్లతోనే. నా లక్ష్యం పేదరిక నిర్మూలన.

కాబట్టే నా ఎకనామిక్స్ వేరే. పేద కుటుంబాలు బలపడితేనే పేద కులాలు బాగుంటాయి. పేద కులాలు బాగుంటాయి. పేద కుటుంబాలతో పాటు, పేద కులాలను బలపరిస్తేనే, వారికి అన్ని సాధికారతలు ఇస్తేనే సమాజం బాగుంటుంది. సమాజంలోని అన్ని ప్రాంతాలను బలపరిస్తేనే రాష్ట్రం బాగుంటుంది. ఇది నేను నమ్మాను. ఆచరించాను. ఫలితాలు కూడా చూపించాను.
ఇదే నా ఎకనామిక్స్. ఇదే నా పాలిటిక్స్. ఇదే నా తండ్రిని చూసి నేర్చుకున్న హిస్టరీ. ఇవన్నీ కలిపితేనే మీ జగన్.
ఇన్ని విప్లవాత్మక మార్పులు చేసిన ప్రభుత్వం. ఇంతగా పేదవాడికి తోడుగా ఉన్న ప్రభుత్వం, ఇంతగా ప్రతి ఇంటికి మంచి చేసిన మనందరి ప్రభుత్వం.. సామాజిక న్యాయం, మహిళా న్యాయం, రైతన్నలకు న్యాయం.. వీటన్నింటిని కూడా దైవకార్యంగా భావించి నిబద్ధతతో అడుగులు వేస్తున్న మనందరి ప్రభుత్వానికి దేవుడి దయ, ప్రజలందరి చల్లని దీవెనలు ఎప్పటికీ చల్లగా ఉండాలని కోరుతూ.. ఈ చర్చను ముగిస్తున్నాను అని సీఎం ప్రసంగం ముగించారు.